# 22

## రాత్రి

జేబులోనుండి పిడికిలిని బైటకు తీసి - పిడికిలి తెరిచి.. అంతా చిల్లర.. ఐదు పైసలు.... పది పైసలు... పావలాలు.. లెక్కబెడుతున్నాడు...

చకచకా.. మనస్సు పరుగెత్తుతూ ... పరుగెత్తుతూ..

చిల్లర నాణేలు

చిల్లర బ్రతుకులు

చిల్లర జీవితం... ప్చ్.. ఎన్నాళ్ళీ చిల్లర

బి.ఎ. ఎమ్మే ఇవన్నీ కలిసి క్లాసును కూడా కలుపుకుని ఈ చిల్లరతనాన్ని దూరం చేయలేక పోయాయి.

ఇంకా చిల్లరగా జీవించలేడు తను

ఇంకా కన్నీళ్ళతో, ఇంకా ఆకలితో అవమానంతో ఆడుక్కోవడంతో ష్... ఊహూ.. వద్దు.. వద్దు... ఈ జీవితమొద్దు.. లెక్కబెడుతున్నాయి కళ్ళు చిల్లరను. మొత్తం కలిపి మూడు రూపాయల ఐదు పైసలు.

అబ్బా - ఇంకా.. ఇంకా ఇరవై పైసలుకావాలి.

ఇరవై పైసలుంటే చాలు - ఐపోతుంది. అంతా ఓకే ఐపోతుంది.

ఈ రాత్రి గడిచి రేపు... రూపులేని రేపు.... రేప్ - థూః

ఇంకా ఇరవై పైసలు ఎలా? ఎలా... ఎలా సంపాదించాలి ఇరవై పైసలు. దేన్నమ్మి సంపాదించాలి. ఏముంది ఇంకా తన దగ్గరమ్మడానికి. ఇప్పటికే అన్నీ అమ్మేశాడు. పుస్తకాలు, వస్తువులు, మనసు, మర్యాద చివరికి యూనివర్శిటీలో వేలమంది కరతాళ హర్షధ్వనుల మధ్య ఎంతో గర్వంతో అందుకున్న గోల్డ్‌మెడల్ - గోల్డ్‌మెడల్ ను అమ్ముకుంటున్న రోజున ఎంతబాధో.. సముద్రాన్ని పిడికెడు గుండెలో బంధించి భరిస్తూ మూగగా టాంక్‌బండ్‌పై హుస్సేన్ సాగర్ గాఢ నిశ్శబ్దాంతరంగంల్లోకి చూస్తు ఆ రాత్రంతా అలా శిలలా ఉండిపోయి మౌనంగా రోదించిన రోజు..

నరకం.... చెప్పరాని... చెప్పలేని వేదన.

వాళ్ళకది ఒట్టి బంగారం బిళ్ల. తనకో వెలలేని ఓ అపూర్వ శ్రమఫలితం. ఓ విజయం.

ప్చ్.. పోనీ. బాధలతో జీవితమే మొద్దు బారిపోయింది.

ఇప్పుడెలా. ఇంకా ఇరవై పైసలు. ఎలా సంపాదించాలి.

రోడ్డుపై నిలబడి ఆకాశం దిక్కు చూస్తున్నాడు

ఎర్రని పశ్చిమాకాశంలో నుండి సూర్యుడు మాయమౌతున్నాడు.

.... ఇక రాత్రి రాజ్యమేలబోతోంది. హుం. ఈ రాత్రితోనే ముగిసిపోవాలి కథంతా.

తొందరతొందరగా తేలాలి సంగతి.

చటుక్కున ఆలోచన. మెరుపు.. తలలో మెరుపు.

ఇంకా జేబులో పెన్నుంది..దాన్ని అమ్మేస్తే.. అమ్మేస్తే ఇరవై పైసలు రావాలి.

వస్తాయి. కాని ప్రాణం లాంటి ఆ పెన్ను.. బి ఎ పరీక్షలురాసి, ఎమ్మేరాసి -గోల్డ్ మెడల్ సంపాదించి, గన్నులా పనిచేసిన పెన్ను.

ఇరవై పైసల కోసం,

కళ్ళనిండా నీళ్ళు. ఓయీ కన్నీళ్ళారా...

ఎందుకొస్తారు నిప్పురవ్వల్లా. ఎందుకు కాలుస్తారు యీ పగిలిన గుండెలను పొండి.. ఇకపొండి

పెన్నును బైటకు తీశాడు

"బాబూ పెన్ను కొంటారా. పావలాచాలు" ఎవరో పెన్నును చూచి, ముఖాన్ని చూచి "ఎక్కడ దొంగిలించావ్‌రా" అని గుడ్లురిమి "ఎమ్మే రాశాను బాబూ ఈ పెన్నుతో, ఒక్క పావలా చాలు"

ఇంకెవరో ముఖం చూచి నిట్టూర్చి- మరెవరో ఎగాదిగా చూ..

-ఎవరో ఓ పుణ్యాత్ముడు పెన్ను తీసుకొని జేబులో పెట్టుకుని అర్ధరూపాయి బిళ్ళ ఇచ్చాడు.

ఐపోయింది మూడు రూపాయల పావలా తయారైపోయింది. పద - పద.

రాత్రయిపోయింది

నడుస్తున్నాడు వేగంగా.. ఇంకా వేగంగా - చీకటి పడి కాస్త ముదరగానే వాడు డబ్బా తెరుస్తాడు. డబ్బాలో గోలీలు. మత్తుమందు గోళీలు, నిద్రగోళీలు, శాశ్వత నిద్రగోళీలు, "మూడ్రూరూపాయల పావలాకు ఫుల్ బాటిల్"

"ఇరవై గోలీలు"

ఎంతమత్తో. మళ్ళీ ఎన్నడూ తేరుకోనంత మత్తు.. తీయని మత్తు..

"ఒకఫుల్ బాటిలియ్యి దాదా"

వెళ్ళాలి. టాంక్‌బండ్‌పైకి. వెళ్ళి సిమెంట్ బెంచీపై కూర్చుని, ఆ నిశ్శబ్దంలో హుస్సేన్ సాగర్లోకి చూస్తూ కూర్చుండి.. కూర్చుండి.

గంటలు. గంటలకొద్దీ ఆ నిశ్శబ్ద మాధుర్యాన్ని అనుభవించి చివరికి సీసానిండా గోళీలను మింగి, బి.ఎ. ఎమ్మే సర్టిఫికేట్లను చించేసి ...

" టంగ్ "

ఒకటే గంట

టాంక్‌బండ్‌పై జనం రద్దీ తగ్గుతోంది.

ఒక్క సెకండ్ షో సినిమాల ట్రాఫిక్ మాత్రమే ఉంది. యీ రద్దీకూడ ఐపోయిందంటే యిక తను ఒంటరిగా....

కాని... ఆమె.. ఆ సిమెంటు బెంచీపై ఒంటరిగా కూర్చుని అప్పుడప్పుడు తనవంక చూస్తున్న ఆమె, ఎవరో... ఆమె యింత రాత్రి ఎందుకు ఒంటరిగా యిలా కూర్చుందో. భయమేయడం లేదా ఆమెకు.

ప్చ్ - ఏమో

అడిగితే.... ఆమెతో మాట్లాడితే..

హుఁ... పోనీలే.. తనే నిష్క్రమించబోతుంటే వేరే మనిషి గురించి తనకు ఆలోచన ఏమిటి.

"టంగ్ - టంగ్"

రెండు గంటలు

ఆమె యింకా అలాగే దీక్షగా చూస్తోంది. నీళ్ళలోకి

తను ఆమె దిక్కు చూస్తూ,

ఆమె అప్పుడప్పుడూ తనదిక్కు చూస్తూ..,

ఆమె లేచి

వస్తోంది.. తన వైపే.. తన దిక్కే

"ఏమిటిలా ఒంటరిగా కూర్చున్నారు" నవ్వింది.. అందంగా.. తీయగా..

"......"

" నేను మీ ప్రక్కన కూర్చోవచ్చా"

"......" ప్రక్కకు జరిగాడు

" మీ పేరు"

"......"

ఆమెయే మాట్లాడుతోంది.

అతనామెను పరిశీలిస్తున్నాడు.

వేశ్యలాలేదు. అలా అని సంపూర్ణంగా సంసార పక్షం స్త్రీగా కూడా లేదు. చదువుకున్న మనిషిలా ఉంది. మంచి సంస్కారం కనబడుతోంది మాటల్లో.

కాలం గడుస్తున్న కొద్దీ చేరువైపోతోందామె.. తన చొరవతో హృదయానికి దగ్గరగా వస్తోంది.

" నాకుతెలుసు మీరు బాగా చదువుకున్నారు" అంది.

" ఔను - ఎమ్మే గోల్డ్‌మెడల్"

"ఉద్యోగం కోసం బాగా ప్రయత్నించారు..కాని దొరకలేదు"

" అలసిపోయారు బాగా.. విసిగిపోయారు..... ఔనా-"

"......"

" చచ్చిపోవాలనుకుంటున్నారా, సీసెడు నిద్రమాత్రలు మింగి"

చటుక్కున తలెత్తాడు.. కాని ఆమె ముఖం చూడలేక.. పట్టుబడ్డ దోషిలా

" నా భర్త ఓ క్లాస్‌మాన్. ఏ క్లాస్. నన్ను తార్చి ఎందరికో ప్రమోషన్లు, అపాయింట్‌మెంట్స్ యిప్పిస్తుంటాడు. నేను ఆరకంగా యీ రాత్రి ఒకనికి ప్రమోషన్ యిప్పించవలసి వచ్చి యిక్కడ కూర్చున్నాను శాంతి కోసం.. "

★★★

" గోల్డ్‌మెడలిస్టయిన మీరు ఎంతసేపూ వైట్‌కాలర్ ఉద్యోగమే చేయాలన్న ఆలోచనెందుకూ... అసలు మనిషికి ఎవరో వేరే ఒకడు ఉద్యోగమివ్వడమేమిటి. మన ఉద్యోగాన్ని మనమే సృష్టించుకోలేమా. మీరు ఒక మామూలు మనిషిగా రిక్షా తొక్కవచ్చు కూలీపని చేయవచ్చు... ఆత్మగౌరవం గల ఏ నౌకరైనా చేయవచ్చు. ఒక వైట్‌కాలర్ జాబే చేయాలని ఎందుకనుకోవాలి మీరు"

" ఐనా ఉద్యోగమే కావాలనుకుంటే... రేపు రాత్రి నేను మళ్ళీ యిక్కడికొస్తాను మీ నిర్ణయం చెప్పండి. నన్ను నేను ఎన్నో సార్లు కోల్పోయినదాన్ని వానలో తడిశాక.... ఎన్నిసార్లు తడిసినా ఒకటేననుకో, మీకు ఉద్యోగమిప్పిస్తాను... కాని మీ ఆత్మ ఏమంటుంది. దాంట్లో తృప్తి ఉంటుందా. డిసైడ్ యువర్ సెల్ఫ్."

ఆమె చొరవగా పైకి వంగి అతని జేబులోని సీసాను బయటికి తీసి హుస్సేన్‌సాగర్‌లోకి విసిరేసింది.

'బుడుంగ్' మని చప్పుడు... ప్రక్క ఆమె నవ్వు.. విశ్వాసం నిండిన నవ్వు

"రేపు వస్తాను మీ నిర్ణయం వింటానికి. యిక్కడికే.... రాత్రి" .. వెళ్తోందామె.. తూర్పుదిక్కు.... రోడ్డుపైనుండి నగరంలోకి.

ఆమెపై నుండి ఎర్రగా సూర్యోదయమౌతోంది.

'ఆంధ్రభూమి' వారపత్రిక

తేది : 24-09-1981